# "సైకో సోమేటిక్ న్యూరోసిస్"



భానుమతీ రామకృష్ణ

'డాక్టర్‌గారూ! డాక్టర్‌గారూ!'

'ఏమ్మా!...'

'ఏంలేదండీ!...నాకు పై కడుపులో అదోకమాదిరి మంటగా వుంటుంది. తల కాస్త విసురుగా వుంటుంది...కాళ్ళు దడ... ఒళ్ళు ఒణుకు ... పై కడుపులో అదోక మాదిరిమంట...తల విసురు...గొంతునరాలు నొప్పి...తల కాస్త నొప్పి...పక్కలు నొప్పి... వీపులోపోట్లు...కాళ్ళు తిమ్మిర్లు...చేతులు కూడా తిమ్మిర్లు పై కడుపులో అదోక మాదిరిమంట...తలకాస్త...'

'ఏమ్మా!...చెప్పిందే చెపితే ఎట్టా! మీకు మందులు రాసిచ్చి నాలుగు రోజులైంది...రెండురోజులైనా వాడారా!...'

'లేదండీ! మొన్ననే తెప్పించాను. నిన్న గ్రహణం రోజు... బాగాలేదు ... యీరోజు రాహుకాలం యింకా వుంది.

'ఏమ్మా!... యింకా మందులు తినకుండానే బాధపడతా మీరు చెప్పిందే చెపతా వుంటే ఏం ప్రయోజనం!...

'డాక్టర్‌గారూ నాబాధ మీకు తెలీడం లేదు...నాకేదో భయం. రాత్రుళ్ళు నిద్ర లేకుండా ఆలోచిస్తూ వుంటాను ... పగలు ఆకలి లేదు...తింటే జీర్ణంకాదు.'

కార్పెట్ క్లీన్ చేసే బ్రెష్‌లాంటి బొద్దు మీసాల డాక్టరు రావణాసురిడిలా ఒక్కసారి బిగ్గరగా నవ్వాడు...రూమంతా ప్రతిధ్వనించింది ... అతనిపక్కనేవున్న లేడీ 'రిసెప్షనిస్టు' అతని నవ్వుకు చిరునవ్వు జోడించింది.

'ఏమ్మా! ... యిప్పు డివరికిదా ఆకిలేస్తా వుంది! జీర్ణం అవుతా వుంది! ... ఆకిలికొక మందు జీర్ణానికింకొకమందు వాడితే సరి...మీకు ఆకిలీ, జీర్ణంవుంటే నా దగ్గిరి కెందుకొస్తారు...భయపడకుండా మందులు తినండి...'

'అవును డాక్టర్‌గారూ నాకు మందులు తింటానికి ఎందుకో భయం. నిజం చెప్పుతున్నాను...నాకా భయం ఎట్టా పోతుంది!'

'అద్దా!... మందులు తింటే పోతుంది.' మళ్ళీ రావణాసురుడిలా నవ్వాడు...నా భయాన్ని బాధనూ డాక్టర్ అంత అలక్ష్యంగా తోసెయ్యడం నాకు కష్టం కలిగించింది ... డాక్టర్ నోటితో నాకేం ఫర్వాలేదని చెపితే నాకు కొంతధైర్యం వస్తుందనిపించింది...కాని ఆయన అదేం చెప్పకుండా తను రాసిచ్చిన మందులు తినమనే చెప్పుతున్నాడు...తింటానికి భయం...తినకుండా వుండేందుకు ధైర్యం చాలదు...



'అది కాదండీ నరాల స్పెషలిస్టు అదేదో మందు తీసుకోమన్నారండీ భయం పోవడానికి...'

డాక్టర్ నుదిటిమీద మీసాలంత కనుబొమలు ముడిపడ్డాయి.

'ఏమ్మా!...నరాల డాక్టరు నరాల మందు చెప్పాడు...కడుపులో వ్యాధికి ఎట్టా సరిపోతుంది!...వాళ్ళేదో రాసిస్తుంటారు ... అదింకా కడుపు చెడగొట్టును ... వాళ్ళకేం తెలుసు కడుపులో సంగతి!... మీరు నే రాసిచ్చిన మందులు వారంరోజులు వాడి తర్వాత చెప్పండి...' అంటూ మరో పేషంట్ వైపు తిరిగాడు డాక్టర్ ...

డాక్టర్ నాకు ధైర్యం చెప్పనందుకు బాధపడుతూ బయల్దేరాను.

* * *

'డాక్టర్‌గారూ!...'

'యస్ మేడమ్...'

'నాకు కడుపులో మంట...కాళ్ళు దడ ...తల విసురు...ఒళ్ళు ఒణుకు ... గొంతు నెప్పి...కాళ్ళు తిమ్మిర్లు...చేతులుతిమ్మిర్లు ...గుండెదడ...వీపునొప్పి...పక్కలునొప్పి... ఏమిటో భయం...'

'అదే అదే...యివన్నీ మొన్న చెప్పారు గదమ్మా! ... ఆభయానికే మందు రాసిచ్చాను తీసుకున్నారా!...'

'లేదండీ...తెప్పించాను...నిన్న గ్రహణం యీరోజు రాహుకాలం...'

...కొత్త 'యమ్. డి. డాక్టర్ నాజూగ్గా నవ్వాడు.....

'వాట్ మేడమ్...'

రాహుకాలానికి మందుకూ సమ్మంధం ఏమిటీ!... ముందు మీరు నే రాసిచ్చిన మందు తీసుకోండి... మీకు నరాల బలహీనతవల్ల ఆభయం ఏర్పడ్డది ... 'యిక వాలంట్రీ' నరాలు సరిగా 'ఫంక్షన్', చేయనందువల్ల మీకు 'డైజషన్' అప్‌సెట్ అయింది...ఆ మందు తీసుకుంటే సరి పోతుంది...

'మరి కడుపుకు సంబంధించిన ట్రబుల్ అన్నారే 'స్టమక్ స్పెషలిస్టు!...'

డాక్టర్ నవ్వాడు...

'ఆయన అదే అంటాడమ్మా...ఆయనకేంతెలుసు నరాలసంగతి!...

ఆయన ఏదో చెప్తారు...మీరు అదంతా పట్టించుకోకండి...వెంటనే నే రాసిచ్చిన మందు వాడండి...అంటూ మరోపేషెంట్ వైపు తిరిగాడు...

నేను వికలమైన మనసుతో ఏం



చేయాలో తోచక ఏమందు తినాలో తెలీక వెనక్కు తిరిగాను.

* * *

'డాక్టర్‌గారూ!

'రాండమ్మా రాండి...

'నాకు కడుపులో మంట...కాళ్ళుదడ... తల తిరుగుడు...గొంతునొప్పి...'

'ఆ ఆ...అదే అదే మొన్నవచ్చి చెప్పారుగా!...కాస్త వేడి చేస్తే గొంతులో యిరిటేషన్ వుంటుంది... నే రాసిచ్చిన 'లాసెంజస్' వాడారా!

'లేదండి తెప్పించాను...నిన్న గ్రహణం... యీరోజు రాహుకాలం యింకా వుంది...'

డాక్టర్ లంబోదరం బిగ్గరగా నవ్వాడు.

'దీనికి రాహుకాలం ఏంటమ్మా!'

'అదికాదు డాక్టర్‌గారూ మా ఫామిలీ డాక్టర్ చెప్పారూ...'

'ఆయనేదో చెప్తాడులెండి... ఆయనకేం తెలుసు గొంతు, ముక్కు సంగతి !...మీరు నే రాసిచ్చిన మందు తీసుకోండి...తగ్గకపోతే 'ఎక్సరే తీస్తాం...'అంటూ మరో పేషెంట్‌వైపు తిరిగాడు...గుండె జారిపోయినట్లయింది... ఒకవిధమైన బెంగతో యింటిముఖం పట్టాను.

మా ఫామిలీ డాక్టర్ అప్పుడేవచ్చారు.

'డాక్టర్ గారూ !...'

'చెప్పమ్మా!...'

'ఏం లేదండీ...నాకు కడుపులో మంట ... కాళ్ళలో దడ ... ఒళ్ళుదడ ... తల విసురు...'

డాక్టర్ నవ్వాడు.

'ఎందుకు డాక్టర్ నవ్వుతారు!...'

'మీకేం లేదమ్మా! మీకేం జబ్బు లేదు...మీరంతా యిమేజిన్ చేసుకుంటున్నారు...అంతే...'

సడన్‌గా నా కెక్కడలేని ధైర్యం వచ్చేసింది ... నాకు కావలసిన మందు ఆ సమాధానమే అనిపించింది...

'నిజంగానా డాక్టర్‌గారూ !

'అవునమ్మా !...సత్యంగా చెపుతున్నాను...మీకేం జబ్బులేదు...అనవసరంగా భయపడుతున్నారు... మీకు చేయించిన టెస్టులన్నీ 'రిజల్టు' లొచ్చాయి — మీరు ఆరోగ్యంగా వున్నారు ...'

'మరి నాకేదో బాగా లేనట్లు, నాకేదో దిగులుగా, ఎప్పుడూ భయంగా అప్తమానం డాక్టర్లు చూసి ధైర్యం చెప్పాలి అన్నట్లు వుంటుందే! ఎంచేత డాక్టర్ గారూ !...'

'దాన్నే సైకో సొమేటిక్ న్యూరోసిస్' అంటాం...మీరు బాధపడే జబ్బు అదే ... మీకే జబ్బూ లేదు ... మీ కేదో జబ్బు వుందనుకుని గోరంతలు కొండంతలు చేసుకుని బాధపడుతున్నారు ... మీకిప్పుడు కడుపులో మంట వుందా ! చెప్పండి !—'

ఉందేమో అని కాస్త ఆలోచించాను... నాకప్పుడు కడుపులో మంట అనిపించలేదు.

'యిప్పుడు లేదు డాక్టర్‌గారూ...ఒక్కోసారి వున్నట్లుంటుంది...'డాక్టర్ నవ్వాడు.

'అది ఎప్పుడూ లేదమ్మా ... మీరు అనుకుంటే వుంటుంది...మీకు నరాల బలహీనత వుంది...అంచేతే మీరు నిద్ర లేకుండా ఆలోచిస్తున్నారు...లేని జబ్బులు వూహిస్తున్నారు...మీకు యింతమంది స్పెషలిస్టులు మందులు రాసిచ్చారే, తిన్నారా!—

'లేదండీ...డాక్టర్‌గారూ నిజం చెప్తే [illegible] మందులు తింటానికి నాకు భయంగా వుందండీ...ఏమందు తినాలో తెలీలేదు...తింటే ఏమవుతుందోనని భయం ...దిగులు...'



'ఆ మందు మీద నమ్మకం లేదు ఆ డాక్టర్లమీద నమ్మకం లేదుకదూ!...'

'అవునండీ! కరెక్టు డాక్టర్‌గారూ...

'మీకెట్లా తెలుసు డాక్టర్‌గారూ!'

డాక్టర్ నవ్వాడు.

'తెలుసమ్మా... మీరు మందులకోసం ఆ డాక్టర్లందర్నీ వెళ్ళిచూట్టంలేదు... మీకు ధైర్యంకావాలి...అది వాళ్ళు చెపుతారేమోనని వెళ్తున్నారు ... వాళ్ళు మందులు రాసిస్తున్నారు...మీతత్వం నాకు తెలుసు గనక చెపుతున్నాను...మీకేజబ్బు లేదు...మీరు మామూలుగావుండండి. మీకే మందులూ వద్దు...నామాట నమ్మండి.'



'నిజంగానా డాక్టర్‌గారూ !' ... నాకా క్షణంలో నాకేజబ్బులేదనిపించింది...ఎక్కడలేని హుషారొచ్చింది' నాలో వున్న తెలీని భయం పారిపోయినట్లయింది... 'అన్నట్లు డాక్టర్‌గారు నాకున్న జబ్బుపేరేమిటో చెప్పారు తమాషాగా! దాని పేరేమిటండీ !'

'సైకో సొమేటిక్ న్యూరోసిస్' అంటారమ్మా.

'మరి యిదీ జబ్బేగా!...'

డాక్టర్ విరగబడి నవ్వారు...

'యిదుగో మీరిప్పుడు అనుకున్నారే దానిపేరే అది...మీకే జబ్బులేదు... మీకే మందూవద్దు ... ధైర్యంగా వుండండి... అంతా సరిపోతుంది ...' అంటూ జయశ్రీ రాదు.